# మారిన మనసు

— అమరేంద్ర

"**ఈ సంగతి** నిజమేనా?" అని నిగ్గదీస్తూ కోపంతో ఎరుపెక్కిన చూపులతో అడిగాడు వేణు—మనసు పడి చేసుకుంటానన్న వేణు. బదులు చెప్పే ధైర్యం లేక తల వంచుకున్నది నిర్మల.

"ఇన్నాళ్ళనుంచీ ఎందుకు దాచావు?"

"తెలిసి దాచలేదు. నిన్న రాత్రి నాన్న చెప్పేదాకా నాకూ తెలియదు." కళ్ళ నీళ్ళు గుడ్లను తొలుచుకుని ఎగిసి పడుతున్నాయి. పెదవులు వణికి పోతున్నాయి. అనుకోని ఉపద్రవ మేదో మీదికి విరుచుకు పడబోతున్నట్లు, కట్టుకున్న ఆశల రమ్య హర్మ్యాలను ఒక్క క్షుటిలో పునాదులతో కూల్చి వేసే భూకంపం చెలరేగుతున్నట్లు నిర్మల నిలువునా కంపించిపోయింది.

"నన్ను మోసం చేద్దామనుకున్నావా?" అని కర్కశంగా అరిచాడు వేణు—నిర్మల కోసం అన్నీ త్యాగం చేస్తానన్న వేణు.

"లేదు. నా మాట నమ్మండి. నిజం తెలిసికూడా మీకు చెప్పలేదనే అనుమానానికి మీ మనస్సులో తావు ఇవ్వకండి. నిన్న నాన్న చెప్పేదాకా నాకు నిజం తెలియదు. మీ మీద ఒట్టు" అని బతిమాలుకుంటూ చెప్పింది నిర్మల.

"నేను నమ్మను. నన్ను సర్వ నాశనం చేయటానికే నువ్వూ, నీ తండ్రీ పన్నాగం వేశారు. కుట్ర పన్ని నన్ను గోతిలో పడదోయాలని చూశారు."

"అటువంటి మాట అనకండి."

"లక్షల విలువ చేసే ఆస్తిని గడ్డిపరక లాగా విదిలించాను. నీ కోసం తలిదండ్రులను ఎదిరించి వాళ్ళతో విరోధం పెంచుకున్నాను. పేదరికంలో పుట్టి పెరిగిన నిన్ను చేపట్టటానికి అన్నీ వదులుకున్నాను. ఇంత మోసమా? ఇంక నీ ముఖం చూడను. మన అనుబంధం ఈ క్షణంలో తెగిపోతున్నది. పాలకడవలో చేతులారా విషబిందువులు చిందించావు. ఇంతటితో నీకూ, నాకూ..." అంటూ దురుసుగా దూసుకు పోతున్న వేణు దారికి అడ్డంగా నిలిచి—

"తొందర పడకండి. కొంచెం సేపు నిదానించండి. నాన్న వచ్చే వేళ అయింది. అన్నీ ఆయనే చెబుతారు" అంటూ ప్రాధేయపడింది నిర్మల.

"నాన్నట—నాన్న! వట్టి మోసగాడు. గజదొంగ. ఆయనతో మాట్లాడవలసిన అవసరం నాకు లేదు. అడ్డు పడకు. తప్పుకో. నేను వెళ్ళి తీరాలి" అంటూ స్నేహ పాశాలతో వేడుకునే కోమల హస్తాలను కఠినంగా విదిలించి నిర్మలను పక్కకు నెట్టి వెళ్ళిపోయాడు వేణు.

తూలి పడకుండా ద్వారం పట్టుకుని నిలబడింది నిర్మల. అరికాళ్ళ కింద నేల అణగారి పోతున్నట్టు తోచింది. వికసించిన వన్నెల పూలతోటలో అనుకోకుండా పెనుతుఫాను విలయతాండవం. తన కోసం సర్వస్వం త్యాగం చేస్తానని, మిన్ను విరిగి మీద పడినా తనను వివాహం చేసుకోవటానికి వెనకాడనని శపథాలు చేశాడు. ఎన్నో వాగ్దానాలు చేశాడు. పెళ్ళికి అన్ని సన్నాహాలూ జరిపించాడు. అంతటి అనురాగం ఒలికించిన వేణు ఈ విధంగా ఆగ్రహావేశం ప్రదర్శించటానికి తను ఏమి అపరాధం చేసింది? ఆనంద శిఖరాలు అధిరోహించాలని ఆశ పడుతున్న క్షణంలో లోతు తెలియని గాఢాంధకార కుహరంలోకి నెట్టి వేసినట్లయింది. ఈ విషమ పరిణామం ఎందుకు సంభవించిందో ఎంత ఆలోచించినా అంతుపట్టడం లేదు.

నిర్జీవ ప్రతిమ లాగా నిర్మల అక్కడే నిలబడి పోయింది. కళ్ళ ముందు ప్రపంచమంతా మసక వేసినట్టు, అలికి వేసినట్టు కనుపిస్తోంది. మెలి తిరిగిన కండలతో, దుబ్బు క్రాపుతో, కోరమీసాలు దువ్వుకుంటూ, ఈల వేసుకుంటూ, ఇప్పటికైనా తెలిసిందా నా ప్రతాపం అన్నట్టు ఓరచూపులతో ఛాతీ విరుచుకుంటూ వస్తున్నాడు రౌడీ రంగడు.

తక్కున తలుపు మూసి, లోపలి గడియ వేసి చాపచుట్టలాగా పడిపోయింది నిర్మల.

• • •

"పాత కాగితాలు కొంటా. పేపర్లు కొంటా" అని కేకలు వేసుకుంటూ కాళ్ళు అరిగిపోయేట్టు ఊరంతా తిరిగి ఒక చేత్తో ఒక గోతం నిండా చిత్తు కాగితాలూ, పాత పుస్తకాలూ; రెండవ చేత్తో తక్కెడా, రాళ్ళూ పుచ్చుకుని గుడిసెకు తిరిగి వచ్చాడు రామస్వామి.


నిర్మల రోజూ చిరునవ్వుతో ఎదురువచ్చి సంచీ సాయం పట్టి క్రిందికి దింపి, తండ్రికి మంచినీళ్ళు అందించి పరిచర్యలు చేసేది. నిర్మల చిరునవ్వు చూడగానే అతని అలసట మటుమాయమైపోయేది.

కాని, ఈ వేళ దిగాలు పడి, తల క్రింద చెయ్యి మోపుకుని మూల కూర్చుని తండ్రి రాకను గమనించనే లేదు. చెదిరిన ముంగురులు ముఖ బింబాన్ని మేఘ శకలాలుగా కమ్ముకున్నాయి. చెక్కిళ్ళ మీద కన్నీటి ధారల చారలు.

రామస్వామి తల తిరిగి పోయింది. తను ఇంటికి వచ్చేసరికే కొత్త పెళ్ళి కూతురుగా నిర్మలను చూస్తానని ఊహించుకుంటూ వచ్చాడు. ఆ నాడే రిజిస్ట్రారు ముందర వేణూ, నిర్మలా వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కాని, ఇంటికి చేరుకునేసరికి నిర్మల మూర్తీభవించిన శోకదేవత లాగా కనపడితే రామస్వామి అయోమయంలో పడిపోయాడు. వడ్డించిన సిద్ధాన్నంలో ఎవరో దుమ్ము పోసి ఉంటారనే అనుమానం శూలం లాగా గుండెలో గుచ్చుకున్నది.

"ఏమమ్మా! అలా ఉన్నావు? ఏం జరిగిందో చెప్పు. ఈ పాటికి మీ ఇద్దరూ హాయిగా పెళ్ళి చేసుకుని ఇంటికి తిరిగి వచ్చి ఉంటారని ఎంతో ఆశతో వచ్చానమ్మా!" అంటూ నేల మీద చతికిల పడి పై పంచతో విసురుకుంటూ అడిగాడు.

తండ్రి కంఠం వినపడగానే ఉలిక్కి పడి ఈ లోకంలోకి తిరిగి వచ్చింది నిర్మల. "నాన్నా!" అని




CHANDRA

ముఖాన్ని చేతులతో కప్పుకుంటూ శోకం పెట్టింది. కట్ట తెగిన వాగు లాగా కన్నీరు పొంగి పొర్లింది.

అంతా తారుమారై పోయిందని రామస్వామి గ్రహించగలిగాడు. గొప్పవాళ్ళ బిడ్డ వేణు తన వంటి నిరుపేద దగ్గర పెరుగుతున్న నిర్మలను చేసుకుంటానని చెప్పినప్పటికీ, ఇది జరిగే పనేనా అనే అనుమానం మొదటి నుంచీ వేధిస్తూనే ఉన్నది. తలిదండ్రుల మాట కాదని, పిత్రార్జితపు ఆస్తిని కాలదన్ని నిర్మలను పెళ్ళి చేసుకుంటానని బాసలు చేసినప్పుడు నమ్మకం కుదిరింది. లోకంలో జరిగే వింతల్లో ఇదొకటి కావచ్చునని ఆశ పడ్డాడు. నిన్నటి రోజునకూడా వచ్చి వేణు నమ్మకంగా చెప్పాడు. మరునాడు రిజిస్ట్రారు ఆఫీసులో పెళ్ళి జరుగుతుందనీ, సిద్ధంగా ఉండవలసిందనీ ఎంతో ఉత్సాహంగా చెప్పి వెళ్ళాడు.

ఆ నమ్మకంతోనే నిన్న రాత్రి నిర్మలకు తన కథ అంతా దాపరికం లేకుండా పూస గుచ్చినట్లు వినిపించాడు. మరునాటి నుంచీ నిర్మల కొత్త జీవితంలో అడుగు పెడుతుందనీ, ఇన్నాళ్ళ నుంచీ తను పడిన శ్రమ ఫలప్రదమవుతుందనీ, కష్టాలలో పెరిగిన నిర్మల సకల సుఖ సంతోషాలనూ అనుభవిస్తుందనీ పొంగి పోయాడు. ఆషాఢ మేఘం లాగా అశ్రువులను వర్షిస్తున్న నిర్మలను చూసి భరించలేక పోయాడు.

"ఇప్పుడే వస్తానమ్మా!" అంటూ పైపంచ భుజాన వేసుకుని బయలుదేరాడు.

"ఎక్కడికి, నాన్నా? మంచి నీళ్ళయినా ఇవ్వాను కాను—పనికిమాలినదాన్ని!" అంటూ నిర్మల లేచి గ్లాసుతో కుండలో నీళ్ళు ముంచి అందించబోయింది.

"వద్దమ్మా! ఇప్పుడే వస్తాను. తలుపు వేసుకో" అంటూ బయటికి వెళ్ళాడు రామస్వామి.

• • •

గార్డు ఈల వేశాడు. సిగ్నల్ వాలింది. ప్రతి పెట్టె దగ్గరా ఆగి లోపలికి తొంగి చూస్తూ మూల మూలలా గాలిస్తున్నాడు రామస్వామి. రైలు కదల బోతున్నది.


ఫస్టు క్లాసు పెట్టెలో కూర్చున్న వేణు కనపడ్డాడు. రామస్వామిని చూసి ముఖం పక్కకు తిప్పేసుకున్నాడు.

లోపలికి ఎక్కి వేణు చేతులు పట్టుకుని, "దిగిరా, బాబూ! ఇవి చేతులు కావు. కాళ్ళు అనుకో. నీతో కొన్ని సంగతులు చెప్పాలి. నా మాట విను. నన్ను కనికరించు. నువ్వు దిగి రాకపోతే రైలు పట్టాల మీద అడ్డంగా పడుకుంటాను. నా శవంమీద నుంచే రైలు వెళ్ళాలి" అని గద్గద స్వరంతో మొర పెట్టుకున్నాడు రామస్వామి.

ఇక తప్పదనుకుని వేణు బెడ్డింగ్ ప్లాటుఫారం మీదికి విసిరేసి, సూట్‌కేసు పుచ్చుకుని కదులుతున్న రైలులోంచి దిగేశాడు. రామస్వామి కాళ్ళు తడబడి క్రింద తూలి పడ్డాడు.

ముఖ్య స్నేహితులతోకూడా చెప్పకుండా ఆదరా బాదరా స్టేషనుకు వచ్చాడు వేణు. ముసలి నౌకరుతో మాత్రం, "వెళ్ళిపోతున్నాను. ఇక ఈ ఊరు ముఖం చూడను" అని వచ్చాడు. ఎలా తెలుసుకుని తనను వెన్నంటి వచ్చాడో రామస్వామి! ఎవరికీ తెలియని తావుకు వెళ్ళిపోవాలనుకున్నాడు వేణు. తను దిగి రాకపోతే అన్నంత అఘాయిత్యం చేస్తాడేమో—మొండిఘటం!

వేణు అయిష్టంగానే దిగి వచ్చాడు. ధణధణా ధ్వని చేస్తూ రైలు సాగిపోయింది. నాటకం ముగిసిన రంగస్థలం లాగా వెలవెలబోతూ మాటు మణిగింది ప్లాట్ ఫారం. దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి. పురుగులూ, దోమలూ జడ కోలాటం వేస్తున్నాయి. ఒక ఖాళీ సిమెంటు బల్ల కనిపించి, "రా, వేణు బాబూ! కూర్చో. నేను చెప్పే విషయాలు విను. అటు తరవాత నీ ఇష్టం. నేను అడ్డు తగలను, బాబూ" అంటూ భుజం మీద చేతులు వేసి బెంచీ మీద కూర్చో బెట్టాడు రామస్వామి. వేణుకు ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఉంది. రామస్వామి ముఖం చూడటానికే చీదరగా ఉంది. అతని మాటలు వినటానికి సుతరామూ మనసు ఒప్పటం లేదు.




"నీకు జరిగినదంతా చెబుతాను, విను, బాబూ!"

"నువ్వేమీ చెప్పనవసరం లేదు. నువ్వు మోస గాడివి. నీ దొంగ మాటలు నేను నమ్మను. ఇంతటితో నన్ను వదిలి పెట్టు."

"నేను నిన్ను మోసగిస్తానా, బాబూ? ! నిర్మల నాకు పంచ ప్రాణాలు. దానిమీద ఒట్టు వేస్తున్నాను. నా మాట నమ్ము" అని తను నేల మీద కూర్చుని వేణు పాదాలు పట్టుకున్నాడు. మసక వెలుగులో వెక్కిళ్ళ మీదుగా జారి బాష్పబిందువులు మెరిశాయి.

వేణు మనస్సు ఆ దీనుడి ముఖం చూడగానే, ఆ స్వరంలోని ఆవేదన వినగానే కొంచెం మెత్తపడింది.

"సరే, నిజం చెప్పు. వింటాను, మరి."

"అయితే, విను, బాబూ! నేను చెప్పేదానిలో ఆవగింజంత అబద్ధం ఉన్నా నేనునరకంలో పడిపోతాను, బాబూ! ఇది జరిగి ఎన్నో సంవత్సరాలు గడిచినా, కళ్లముందు ఇప్పుడు ఉన్నట్లుగా అనిపిస్తుంది. నేను ఒక పెద్ద దొంగతనం చేసి పట్టుపడి ఆరేళ్ళ జైలు శిక్ష అనుభవించి విడుదల అయాను. బయటికి వచ్చేముందు జైలులో నాకు బాగా స్నేహితుడై మెలగిన వీరాస్వామి ఒక కోరిక తీర్చమన్నాడు. ముందుగా అతని వూరు వెళ్ళి పెళ్ళాం, బిడ్డల క్షేమం తెలుసుకుని జాబు వ్రాయమని వేడుకున్నాడు. సరాసరి అతను చెప్పిన గుర్తులనుబట్టి ఆ వూరు వెళ్ళాను" అని గడిచిన సంఘటనలన్నీ చెప్పటం మొదలుపెట్టాడు.

అద్దె చెల్లించలేకపోవటంవల్ల వీరాస్వామి భార్యను ఇంటివాళ్ళు తరిమివేశారు. వూరి బయట ఒక పాడుపడిన గుడి మండపంలో తలదాచుకుంటూంది. ముష్టి ఎత్తుకుంటూ బతుకుతూంది. రామస్వామి వెళ్ళి చూసేసరికి తీవ్రమైన సుస్తీతో మూలపడి ఉంది. ఇప్పుడో, ఇంకొంచెం సేపటికో ప్రాణం పోయే స్థితిలో కనిపించింది. దగ్గరలో ఒక మూడేళ్ల పాప తల్లి దుస్థితి తెలియని అమాయక దశలో ఇసుకలో బొమ్మరిల్లు కట్టుకుని ఆడుకుంటూంది. చినిగి పేలికలైన గౌనూ, చక్కటి ముఖమూ, చెంపకు చారెడేసి కళ్ళూ-చూడగానే కడుపు తరుక్కుపోయింది. అతని కళ్ల ఎదుటే అభాగ్యురాలు ఆయాసపడుతూ అవలించింది. చుట్టుపక్కల వాళ్ల సహాయంతో అంత్యక్రియలు జరిపించాడు రామస్వామి. దిక్కూ మొక్కూ లేని ఆ పాపను ఎత్తుకుని బయలుదేరాడు. ఆ పాప పుట్టటానికి రెండు రోజుల ముందరే తండ్రి వీరాస్వామిని అరెస్టు చేశారు. బీదలకు అప్పులుపెట్టి, జలగలాగా పట్టి పీడించే ఒక వడ్డీ వ్యాపారిని ఆవేశంలో కత్తితో పొడిచి చంపాడు. నేరం రుజువయింది. వీరాస్వామికి ఉరి శిక్ష వేశారు.

ఆ దిక్కులేని పాప రామస్వామి పాల పడింది. అప్పటిదాకా దొంగతనాలు చేసి జబర్దస్తీగా బతికాడు రామస్వామి. అత్తవారి ఇంటికి అల్లుడు వెళ్లినంత దర్జాగా ఎన్నోసార్లు కైదుకు పోయి వచ్చాడు.

కాని, పాలుగారే పసి పాప అమాయకపు ముఖం చూసిన క్షణంనుంచీ అతని మనస్సు మారింది. గత జీవితంపట్ల రోత పుట్టింది. ఆ పాపను కంటికి

రెప్పలాగా సాకి పెద్దదాన్ని చెయ్యాలనే ఆశయం ఆ దుష్ట హృదయంలో నిద్రపోతున్న మానవత్వాన్నీ, మమతనూ మేలు కొలిపింది.

ఆ పాప కోసం ఎన్ని కష్టాలైనా పడాలి. లోకంలో ఇతర పిల్లలలాగే చదువూ, సంగీతమూ నేర్పించాలి. మర్యాదస్థుల పిల్లలతో గౌరవంగా మెసులుకునేటట్లు పెంచాలి. ఆ క్షణంలో రామస్వామి కొత్త వెలుగు చూశాడు. ఈ పాప కోసమే తను పాత పద్ధతులన్నీ కట్టిపెట్టి, కష్టపడి జీవించాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు. పాత స్నేహితులతో తెగ తెంపులు చేసుకున్నాడు. క్రమంగా పూర్వపు వ్యసనాలను వదిలించుకున్నాడు. జైలు నుంచి విడుదలైనాక శూన్యంగా ఉంటుందేమోనని భయపడిన జీవితానికి ఈ పాప ఒక గమ్యాన్ని కల్పించింది. మసక చీకట్లో ధ్రువతార వెలిసింది.

అక్కడినుంచి పాపను తీసుకుని సుందరమ్మ ఉన్న వూరు చేరుకున్నాడు. జైలుకు పోక పూర్వం ఇద్దరికీ చాలా కాలంనుంచీ సంబంధం. కాపుసారా దొంగవ్యాపారం చేసేది. రామస్వామి దొంగిలించిన సొమ్ములన్నీ కరిగించి పంచుకుంటూ చిలకా గోరింకల్లా ఉండేవారు. ఈ పాపను చూసేసరికి సుందరమ్మ ఎంతో ముచ్చట పడింది. కన్న బిడ్డలాగా పెంచుతానన్నది. ఆ పతిత అంతరంగంలో నక్కి ఉన్న మాతృత్వం పెల్లుబికింది. ఎంతో మక్కువతో ఏ లోపమూ రాకుండా పాపను సాకింది.

రామస్వామి ఒళ్ళు వంచి కండలు కరిగించి బతుకు తెరువుకోసం పెనగులాడాడు. నిజాయితీగా పొట్ట పోసుకోవాలని ఎన్నో తిప్పలు పడ్డాడు. పూర్వపు కళంక ముద్ర తుడిచివేసుకోవటానికి ఎంత పెనుగులాడినా అనుమానాలూ, అవమానాలూ తప్పలేదు. చుట్టుపక్కల ఎక్కడ దొంగతనం జరిగినా పాత కేడీ అని పట్టుకుని లాకప్‌లో పెట్టి దెబ్బలు కొట్టేవాళ్లు పోలీసులు. పాపకు ఆరో ఏడు వచ్చింది. ఆవూళ్లో ఉంటే మర్యాదగా బతికే అవకాశం లేదని పాపను ఎత్తుకుని వెళ్లిపోయాడు మరొకవూరు. పాపమీద ఏర్పడ్డ మమకారంవల్ల సుందరమ్మ అడ్డు పడుతుందనే భయంతో అర్ధరాత్రి సమయాన పాపను ఎత్తుకుని చెప్పకుండా పారిపోయాడు.

స్టేషన్‌లో లైసెన్సు కూలీగా బరువులు మోశాడు. కాని, పాత కేడీ ముద్ర ముఖాన చెరిగిపోలేదు. ఎవరి జేబులో డబ్బులు పోయినా, అనుమానంతో రామస్వామినే పట్టుకుని కొట్టి పీడించేవారు. పెద్ద హోటల్లో కొన్నాళ్లు సర్వరుగా పని చేశాడు. కొంతకాలం అద్దె రిక్షా తొక్కుకుంటూ బతికాడు. పోలీసుల బెడద తప్పలేదు. గతం చీకటి నీడలాగా వెన్నంటి తరుముతూనే ఉంది. బియ్యం దుకాణంలో బస్తాలు మోశాడు. లగుడుబళ్లు ఈడుస్తూ కొన్నాళ్ల కాలం గడిపాడు.

ఈ తిప్పలన్నీ పాప భవిష్యత్తు దిద్ది తీర్చాలనే తపనతోనే చిరునవ్వుతో భరించాడు. పాపను బడిలో చేర్పించాడు. నీలం లంగా, తెల్ల చొక్కా వేసి స్కూలులో దింపి వచ్చాడు. టీచరు సునంద ఈ పాపను చూసి ముచ్చటపడి నిర్మల అనే పేరు పెట్టింది. ఆవిడే పుస్తకాలు కొనిపెట్టింది.

పాపను వెదుక్కుంటూ సుందరమ్మ కూడా రామస్వామి దగ్గరికి చేరుకున్నది. పాప మీద గాఢమైన వాత్సల్యంవల్ల తను కూడా వచ్చేసింది.

కొన్నాళ్ళు రామస్వామితోబాటుగా ఒళ్ళు వంచి పనిచేసింది. కాని, మళ్ళీ దొంగతనం చేసి డబ్బు తెమ్మని పోరు పెట్టటం సాగించింది. కాయకష్టం వల్ల లాభం లేదు. అదృష్టం బాగుంటే ఒక్క రాత్రి వేలు సంపాదించవచ్చుననీ, మళ్ళీ మునుపటిలాగే దొంగతనాలు మొదలు పెట్టమనీ చెవిలో జోరీగలాగా ఒకటే రొద.

ఇది భరించలేక రామస్వామి సుందరమ్మతో ఎన్నో ఏళ్ళ నుంచీ సాగుతున్న సంబంధం పటాపంచలు చేసుకున్నాడు. స్కూలు టీచరుగారి ఇంట్లోనే చిన్న గుడిసెలోకి మకాం మార్చేశాడు. పాప ఎక్కువ సేపు టీచరు సునంద దగ్గరే ఉండేది.

అప్పటినుంచీ సుందరమ్మ పగపట్టిన నాగుపాము అయింది. రామస్వామి మీద కత్తి కట్టింది. ఇన్నాళ్ళు నుంచీ పాపను ఎంతో మమకారంతో పెంచిన మనిషిలో అకారణంగా ద్వేషం బుస కొట్టింది. రామస్వామినీ, పాపనూ సర్వనాశనం చేయాలనీ, ఇన్నేళ్ళుబట్టీ రామస్వామి పడిన పాట్లన్నీ బూడిదలో పోసిన పన్నీరు కావాలనీ అక్కసుతో పగ సెగలు కక్కింది... ప్రేమకూ, ద్వేషానికీ మధ్య ఎంతో దూరం లేదనిపిస్తుంది.

ఈ వూళ్ళో మళ్ళీ సారా వ్యాపారం, వ్యభిచార గృహం నడపటం మొదలు పెట్టింది. మంచి అంతలు మధ్య మధ్య తొంగిచూసినప్పటికీ, పూర్వపు స్వభావం కుక్కతోక లాగా వంకర తిరగక మానదు.

కొల్లలుగా డబ్బు కూడబెడుతూంది. డబ్బుకు ఏ పని అయినా చేయటానికి వెనకాడని రౌడీ




"కర్కశంగా, గరుకుగా ఉండే
పళ్ళపొడులు మీ పళ్ళకు,
చిగుళ్ళకు
హానికలిగించవచ్చు..."

TP.G.30 T.

కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను, చెడుశ్వాసను కూడా
అరికట్టండి, పళ్ళను కాపాడుకోండి.




కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్. అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది.

మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పర్‌మెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు.

ముతాను చేరదీసింది. ఒకనాడు నిర్మల స్కూలుకు పోతూంటే సుందరమ్మ ఉసికొలిపిన రౌడీ రంగడు ఈల వేసుకొంటూ, వెకిలి నవ్వులతో, మోటుమాట లతో వెంబడించాడు. వెనక వస్తున్న సునందమ్మ టీచరుగారు ధైర్యంగా రంగడి చెంపమీద ఛెళ్ళున దెబ్బ వేశారట. పోలీసులకు అప్పగిస్తాను, జాగర్త! అనేసరికి రంగడు కాలికి బుద్ధిచెప్పాడు. అప్పటి నుంచీ రంగడు కూడా రామస్వామినీ, అతను సర్వస్వమూ ధారపోసి రూపు రేఖలు దిద్దుతున్న నిర్మల భవిష్యత్తునూ విధ్వంసం చేయాలని పగబూని తరుణంకోసం వేచి ఉన్నాడు.

అంతవరకూ కుతూహలంతో కథ వింటున్న వేణు — "అయితే, నిర్మల నీ కూతురు కాదన్న మాట. ఆ కులట నిర్మల తల్లి కాదన్న మాట" అన్నాడు.

"కాదు. దిక్కులేని పిల్ల. మక్కువతో పెంచు కుంటున్నాను. నా జీవితమంతా దాని సుఖంకోసమే ధారపోస్తున్నాను. నీతిగా, నిజాయితీగా బతుకుతూ, అష్టకష్టాలూ పడుతూ పాపను చదివిస్తున్నాను. జంతువులాంటి నన్ను అది మనిషిగా మార్చింది. నా కళ్ళ ముందు ఒక గొప్ప వెలుగై, నన్ను ముందుకు నడిపిస్తున్నది. నా కష్టాలన్నీ గట్టెక్కుతాయనీ, నీ చేతుల్లో పెట్టి నిశ్చింతగా కళ్ళు మూసుకో వచ్చునని ఆశపడ్డాను. దాన్ని అదృష్టం వరించిందని పొంగిపోయాను.

"కాని, ఇప్పుడు నా మీద నాకు పట్టలేని అసహ్యం కలుగుతూంది. ఆ దిక్కులేని పిల్ల నా వంటి దుర్మార్గుడి పాలపడడం దేనికి? జైలునుంచి బయటకి రాగానే నేను అక్కడికి పోకుండా ఉంటే ఎంత బాగుండేది! ఏ పుణ్యాత్ములో, ఏ భాగ్యవంతులో ఆ పిల్లను చేరదీసి, పెంచి పెద్దచేసి ఉంటే ఎంత సుఖపడేదో! నాకు దొరకటం వల్లనే ఆ నిరపరాధిని ఇన్ని అగచాట్లకు గురి అయింది. నేను దొంగను. పీనుగ్ని. నా నీడ సోకిన వాళ్ళందరికీ బాధలే. నా మూలంగానే ఇన్ని బాధలు పడుతున్నది ఏ పాపమూ ఎరగని అమాయకురాలు. మా అంతస్తును మరిచి పోయి ఆశలు పెంచుకోవటం నా అపరాధం. మన్నించు, వేణుబాబూ, నిన్ను విసిగించాను. జరిగిన సంగతులన్నీ చెప్పాను. ఏదీ దాచలేదు. ఇందులో మోసం ఏమీ లేదు. ఇక నీ ఇష్టం. వెళతాను, మరి" అంటూ రామస్వామి లేచాడు.

వేణు నోటివెంట మాట పెగలలేదు. ఎదురుగా మిలమిల మెరిసే నక్షత్ర మండలం. నిశీథ నిశ్శబ్దంలో వెదజల్లిన శుభాక్షతల్లాగా తళుక్కుమం టున్నాయి తారకలు.

● ● ● ●

"ఎక్కడికి, నిర్మలా? ఆగు" అని కేకవేశాడు వేణు.

"టీచరమ్మగారి ఇంటికి."

"నేనూ వస్తాను. పద."

"దేనికి?

"మనతోబాటుగా రమ్మని ఆహ్వానించటానికి."

"ఎక్కడికి?"

"రిజిస్ట్రారుగారి సమక్షానికి."

"నిజంగానా?! మధ్యలో మనస్సు మారిపోదు కదా?"

"ఇది తిరుగులేని నిర్ణయం."

"నిన్నటికీ, ఈ వేళటికీ ఎంత మార్పు!"

"నిన్న నేను దానవుణ్ణి, నిర్మలా!"

"ఈవేళ దేవతలా?"

"కాదు. ఈ వేళ నేను మానవుణ్ణి."

"నిన్న ఎంత నిరాశ!"

"ఆశా నిరాశల దాగుడు మూతలే జీవితం."

గగనపథంలో ప్రభాకరమూర్తిని అనుసరించే ఛాయాదేవిలాగా సాగింది నిర్మల. అశ్రు దరహాసాల రాగమాలిక నిర్మల హృదయ స్పందనలో ముఖరిం చింది.

"చిత్తుకాగితాలు కొంటా! పాతపేపర్లు కొంటా" అనే కేక పక్క వీథిలోంచి వినిపిస్తూంది.

"ఎంత ప్రాధేయపడినా మా నాన్న రానని మొండిపట్టు పట్టాడు. తన నీడ సోకిన నా పుస్తకాగ్యం, సంతోషం నిలవలేవట. బలిమాలి విసిగి పోయి ఒక్కణ్ణే వచ్చాను."

"నాకు తెలుసు — నాన్న ఎంత మనిషి!" అని కొంగుతో కళ్ళు తుడుచుకుంది నిర్మల.

ఇద్దరి ముందునుంచీ ఇంద్రధనుస్సు రంగులు మెరిపిస్తూ రెండు సీతాకోకచిలుకలు ఎగిరిపోతూ పెళ్ళి పెద్దల్లాగా దారి తీశాయి.

('సైలాస్ మార్నర్'కు కృతజ్ఞతతో)


# జనతాసెమ్

రెండు విధాల లాభించే సిమెంటు పెయింటు



జనతాసెమ్-సిమెంట్ పెయింట్లలో "సిప్లస్" సూత్రాన్ని మొట్టమొదట ప్రవేశపెట్టినవారు.

ఈ విధంగా ఎంతో ఆదా అవుతుంది. ఇంతేగాకుండా రెండింతలమేర పూయవచ్చు.

జనతాసెమ్
వర్ణయుగంలో అగ్రనాయకులు.

EP. LC. 12

ఆంధ్రకు విక్రయ ఏజెంట్లు : మెస్సర్స్. కిరణ్ అండ్ కం., సంతపేట, నెల్లూరు, ఆంధ్ర ఫోను : 1768
మెస్సర్స్ లక్ష్మి హార్డ్వేర్, చిత్తూరు, అనంతపురం మరియు బళ్ళారి జిల్లాలకు.